

నత్తనడకన ఈ-శ్రమ్

ఈ-శ్రమ్ పథకానికి అసంఘటిత, సంఘటిత కార్మికులు అర్హులు. కార్మికుడు మృతి చెందితే అతడి కుటుంబానికి రూ.2 లక్షల బీమా సొమ్ము అందనుంది. 8లో▸



వార్షికోత్సవానికి వేళాయె

ఖానాపూర్‌లోని శాంతినగర్‌కాలనీ పోచమ్మ ఆలయం ముస్తాబవుతోంది. ఈనెల 11 నుంచి 13వరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వార్షికోత్సవాలు నిర్వహించనున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.0/16.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రి చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

12నుంచి ప్రతిష్ఠామహోత్సవాలు



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కుంటాల: మండలంలోని ఓలాలో నూతనంగా నిర్మించిన విఠలేశ్వర– రుక్మాబాయి ఆలయ స్థిర ప్రతిష్ఠామహోత్సవ వేడుకలు ఈనెల12 నుంచి 16వరకు నిర్వహించనున్నారు. మహోత్సవానికి హాజరుకావాలని గురువారం నిర్మల్‌లో దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఆలయ కమిటీ సభ్యుడు గందె రాజ్ కుమార్ తదితరులున్నారు.

నేటి నుంచి శక్తికేంద్రాల సమావేశాలు నిర్వహించాలి

భైంసాటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడమే లక్ష్యంగా ఈనెల 10నుంచి శక్తికేంద్రాల సమావేశాలు నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి సూచించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. పార్టీ ఆదేశాల మేరకు ఈనెల 25వరకు శక్తికేంద్రాల కార్నర్ సమావేశాలు నిర్వహించాలని పేర్కొన్నారు. పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్, అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజీ పటేల్ తదితరులున్నారు.

విద్యుత్ కోతలకు నిరసనగా సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా



సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

దిలావార్‌పూర్: విద్యుత్ కోతలను నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట రైతులు ధర్నా చేశారు. కాంగ్రెస్ నాయకులు రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. కరెంట్ కోతలతో చేతికందే దశలో ఉన్న పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తంజేశారు. కోతలు లేకుండా మధ్యాహ్న సమయంలో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తామని విద్యుత్ అధికారులు తెలపడంతో ఆందోళన విరమించారు. డీసీసీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి, జెడ్పీటీసీ రమణారెడ్డి, సర్పంచ్ వీరేశ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రకృతివనంలో నీడనిచ్చే మొక్కలు పెంచాలి



ప్రకృతివనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఖానాపూర్: నీడనిచ్చే మొక్కల పెంపకంపై అధికారులు, నాయకులు దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ హేమంత్ బొర్కడే సూచించారు. గురువారం మండలంలోని బాదన్‌కుర్తి పంచాయతీ పరిధి చింతల్‌పేట్ గ్రామ బృహత్ ప్రకృతివనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్వపు శ్రీనివాస్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ శనిగారపు శ్రావణ్, ఉపసర్పంచ్ నవీన్, ఎంపీడీవో మల్లేశ్, ఎంపీవో చంద్రశేఖర్ ఉన్నారు.

నేటి నుంచి 'ప్రజాగోస–బీజేపీ భరోసా'

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీ రాష్ట్రశాఖ పిలుపుమేరకు నేటి నుంచి జిల్లాలోని శక్తి కేంద్రాల్లో ప్రజాగోస–బీజేపీ భరోసా సమావేశాలు నిర్వహిస్తామని ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ నాయుడు మురళీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 10నుంచి 25వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా శక్తి కేంద్ర స్థాయి సమావేశాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. శుక్రవారం తల్వేద గ్రామంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే మొదటి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జెడ్పీ మాజీ చైర్మన్ చిట్యాల సుహాసినిరెడ్డి పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు నిర్మల్‌లోని బంగల్‌పేట్‌లో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఇవేం కోతలు..!?

ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు బాబాసాహెబ్. తానూరు మండలం హిప్నెల్లి గ్రామం. ఇతనికి నాలుగున్నర ఎకరాలు ఉండగా కొంత శనగ, మిగతాదంతా మొక్కజొన్న సాగు చేశాడు. శనగ చేతికి వస్తుండగా, మక్క పొట్టదశకు చేరుతోంది. సకాలంలో నీరందక పోతే ఎండిపోతుంది. పంటకు నీరందాలంటే ఇదిగో ఇలా అర్ధరాత్రి అపరాత్రి అనే తేడా లేకుండా నిద్రాహారాలు మానుకుని చేన్లకు రావాల్సి వస్తోంది. ఎందుకంటే..? 'త్రీఫేజ్ కరెంట్ ఎప్పుడిస్తరో తెలుస్తలేదు.. వాళ్లు ఇచ్చినప్పుడే నీళ్లు పెట్టుడు' అని బాబాసాహెబ్ చెబుతున్నాడు.



చేతిలో ఇలా టార్చిలైట్ పట్టుకుని, తలపై గొంగళి కప్పుకొని వెళ్తున్న ఈ పెద్దమనిషి పేరు న్యాలకంటి గంగాధర్. ఊరు కుంటాల మండల కేంద్రం. తనకున్న తొమ్మిదెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. పంట పొట్టదశకు వచ్చింది. సమయానికి నీళ్లు పెట్టకపోతే పడ్డ కష్టమంతా వృథా అవుతుంది. త్రీఫేజ్ కరెంట్ కోతల పుణ్యమా.. అని ఇలా రాత్రి పూట, చలిలో టార్చిలైట్ సాయంతో పంటకు నీరందించేందుకు చేన్లకు వెళ్తున్నాడు.



ఇది కుంటాల మండలం ఓలా శివారు ప్రాంతం. బుధవారం రాత్రి 10గంటలకు ఇక్కడ చలిమంట కాగుతున్నది చుట్టూ చేన్లున్న రైతులు. ఈ రాత్రి ఎందుకిలా ఇక్కడ మంటకాగుతున్నారు అంటే..? 'రాత్రి 11గంటలకు త్రీఫేజ్ కరెంట్ వస్తుందని కరంటోళ్లు చెప్పారు.. అందుకే ఎదురుచూస్తున్నాం' అని చెప్పారు. వణికిస్తున్న చలితోపాటు చీకట్లో ఏమన్న జంతువులు దగ్గరకు రాకుండా ఉండడానికి ఇలా చలిమంట వేసుకున్నామని పేర్కొన్నారు.





ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు తానూరు మండలం ఉమ్రి(కె)కు చెందిన షిండె గంగాధర్. తనకున్న తొమ్మిదెకరాల్లో మొక్కజొన్న, శనగ సాగు చేశాడు. త్రీఫేజ్ కరెంట్ సక్రమంగా రాకపోవడంతో మక్కకు నీరందక ఎండిపోయే దశకు చేరింది. చేసేది లేక, పంటను కాపాడుకోవడానికి గంగాధర్ రూ.45వేలు ఖర్చు చేసి ఆయిలింజన్ కొనాల్సివచ్చింది.



కుంటాల మండలం మెదన్‌పూర్‌లో నీరందక ఎండుతున్న మొక్కజొన్న



తానూరు మండలం హిప్నెల్లిలో కరెంట్ కోసం చేన్లోనే రాత్రివేళ పడిగాపులు కాస్తున్న రైతు

- జిల్లాలో ఎండుతున్న పంటలు
- తల్లడిల్లుతున్న అన్నదాతలు
- వేళాపాలా లేని కరెంట్‌తో ఇక్కట్లు
- రాత్రుళ్లు పంటచేలలోనే పడిగాపులు
- ప్రాణాంతకంగా మారిన విద్యుత్

నిర్మల్: 'దేశంలోనే 24గంటలపాటు కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. సాగు, తాగునీటికి ఏ ఇబ్బందీ లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నాం. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోంది..' అంటూ సీఎం కేసీఆర్ ఈ నెల 5న నాందేడ్‌లో నిర్వహించిన సభలో పేర్కొన్నారు. కానీ.. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ప్రస్తుత పరిస్థితి విరుద్ధంగా కనిపిస్తోంది. సకాలంలో నీరందక పొట్టదశకు చేరుతున్న పంటలు ఎండుతున్నాయి. ఎందుకిలా.. అని ప్రశ్నిస్తే 'కరెంట్ లేకపోతే మోటరెట్ల నడుస్తది. మోటర్ లేకపోతే పంటకు నీళ్లెట్లస్తయి. అసలు కరెంట్ ఎప్పడొస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలుస్తలేదు. త్రీఫేజ్ కరెంట్ కోసం ఎదురు చూసుడున్నది. అర్ధరాత్రి అపరాత్రి ఎప్పుడచ్చినా నీళ్లు పెట్టితందుకు చేన్లకు ఉరుకుడున్నది. ఇవేం తిప్పలు సారు.. అని అడిగితే జవాబు చెప్పేటోళ్లు లేరు..' అని రైతులు వాపోతున్నారు. కరెంట్ కష్టాలు భరించలేక, కళ్ల ముందే పంటలు ఎండుతుంటే తట్టుకోలేక అన్నదాతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఆక్రందనతో అందుబాటులో ఉన్న సబ్‌స్టేషన్లను ముట్టడిస్తున్నారు. ధర్నాలు, రాస్తారోకోలకు దిగుతున్నారు.

యాసంగిలో పంటల సాగు (ఎకరాల్లో)	
వరి	92,000
మొక్కజొన్న	95,000
శనగ	68,000
నువ్వులు	12,000
వేరుశనగ	1,000
మినుములు, పెసలు	240
ఇతర పంటలు	3,000
మొత్తం	2,71,240

ప్రాణమే పోయింది..

పంటను దక్కించుకునేందుకు రాత్రిపూట పోయిన రైతన్న తిరిగిరాలేదు. చిమ్మచీకట్లలో పచ్చనిపంటకు నీరందించి వస్తుండగా, రోడ్డుప్రమాదం రూపంలో మృత్యువు కాటేసింది. కడెం మండలం పాండ్వాపూర్‌కు చెందిన రైతు మల్లేశ్ (40) బుధవారం రాత్రి తాను సాగుచేస్తున్న వరిపంటకు నీరందించేందుకు వెళ్లాడు. మోటర్ ఆన్ చేసి బైక్‌పై ఇంటికి తిరిగి వస్తున్నాడు. గ్రామ సమీపంలోని అటవీశాఖ చెక్‌పోస్ట్ వద్దకు రాగానే చీకట్లో సరిగా కనిపించక ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. అంతే.. మల్లేశ్ తలకు తీవ్ర గాయాలై రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి భార్య, ఇద్దరు కుమారులు అనాథలయ్యారు. కుంటాల మండలం విఠాపూర్ శివారులో ఓ రైతు రోజూ రాత్రి చలిలో పడుకోవడంతో పక్షవాతానికి గురై ఆస్పత్రి పాలయ్యాడు. రాత్రి పూట కరెంట్ అటు పంటలనే కాదు.. ఇలా రైతన్నల ఇళ్లలోనూ చీకట్లు నింపుతోంది.

పరేషానే సారూ..

'ఇన్నిరోజులు పొద్దున, రాత్రికి ఇచ్చినోళ్లు ఇప్పుడెందుకు ఇట్ల చేస్తున్నారంటే..? లోడు ఎక్కువైతుందని ఒక్కో ఫీడర్ ఒక్కోటైంల త్రీఫేజ్ ఇస్తున్నామని కరెంటోళ్లు చెబుతున్నరు. పుష్కలంగా నీళ్లు, ఎప్పుడూ కరెంట్ ఉంటుందన్న నమ్మకంతోనే కదా.. మేం పంటలేసుకున్నం. ఇప్పుడిట్ల పరేషాన్‌చేస్తే ఎట్ల సారూ..' అని జిల్లా రైతులు ఆవేదన వ్యక్తంజేస్తున్నారు. త్రీఫేజ్ కరెంట్ ఎప్పుడస్తుందోనని ఎదురు చూసుడున్నదని వాపోతున్నారు. ఎప్పుడు కరెంటస్తదో తెలియక ఏ లగ్గం, దావత్‌లకు కూడా పోకుండా చేన్లకు, ఇంటికి తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. లోకేశ్వరం, కుంటాల, ముధోల్, కుభీర్, తానూరు, సారంగపూర్ తదితర మండలాల్లోని గ్రామాల్లో ఇప్పటికే సకాలంలో నీరందక మక్క, వరి పంటలు ఎండుతున్నాయి. 'కరెంటిస్తారన్న నమ్మకంతోనే పంటలు వేశామని, ఇప్పుడు ఇలా కోతలు పెట్టి పంటతో పాటు మా ప్రాణాలనూ ఎందుకు తీస్తున్నారు..' అంటూ రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సరిపడా నీళ్లున్నా.. కరెంట్ సకాలంలో రాక కళ్లెదుటే పంటలు ఎండిపోతుంటే.. ఆక్రందనతో సబ్‌స్టేషన్లను ముట్టడిస్తున్నారు. సర్కారు తమ గోస పట్టించుకోవాలని నినదిస్తున్నారు.

ఎప్పుడస్తుందో తెలుస్తలేదు



కరెంట్, నీళ్లు ఉన్నాయన్న నమ్మకంతోని ఎకరంలో నువ్వు, మూడెకరాల్లో మక్క ఏసిన. ఇప్పుడు త్రీఫేజ్ కరెంట్ ఎప్పుడస్తుందో తెలుస్తలేదు. బుధవారం రాత్రి 11గంటలకు వస్తుందంటే చేన్లకు పోయిన. వచ్చింది. కానీ.. రోజూ చలిల రాత్రి పూట జాగరణ చేసుడున్నది.

– పోతన్న, ఓలా, కుంటాల మండలం

జాబ్‌కార్డు కలిగినవారికి ఉపాధి కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీవో

మామడ: జాబ్‌కార్డు కలిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. గురువారం మండలంలోని దిమ్మదుర్తి గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాబ్‌కార్డు కలిగిన వారంతా ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొరిటికల్ గ్రామంలో క్రీడా ప్రాంగణం, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీడీ ఓని ప్రసాద్, ఏపీవో శివాజీ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నర్సరీల్లో విత్తనాలు నాటే ప్రక్రియ పూర్తి చేయాలి

లక్ష్మణచాంద: నర్సరీల్లో విత్తనాలు నాటే ప్రక్రియ పూర్తి చేయాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. గురువారం మండలంలోని బోరిగాం గ్రామంలోని నర్సరీని ఆమె ఏపీడీ ప్రసాద్‌తో కలిసి పరిశీలించి మాట్లాడారు. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా నీళ్లు అందించాలని సిబ్బందికి సూచించారు. ఎస్‌ఆర్ సుధాకర్ తదితరులున్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో శ్రీలత

కుంటాల: గ్రామాల్లో వందశాతం పన్నులు వసూలు చేసి పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని డీపీవో శ్రీలత సూచించారు. గురువారం మండలంలోని అంబకంటిలో పలు రికార్డులు పరిశీలించి మాట్లాడారు. ఇంటి పన్నుతోపాటు హరితనిధి పేరిట అదనంగా రూ.300 వసూలు చేయాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా పంచాయతీ ట్రాక్టర్‌కు అందించి డంపుయార్డుకు తరలించాలన్నారు. బాధ్యతగా నర్సరీలో మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. వారి వెంట సర్పంచ్ ప్రదీప్‌కుమార్, ఎంపీవో రహీం, ఉపసర్పంచ్ రమేశ్, కార్యదర్శి ఉత్తమ్ తదితరులున్నారు.

ప్రాణాలు తీస్తున్న చెక్‌పోస్ట్!

- రోడ్డుపైనే వాహనాలు ఆపి ఎంట్రీఫీజు వసూలు చేస్తున్న సిబ్బంది
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- గాలిలో కలుస్తున్న ప్రాణాలు



పాండ్వపూర్ చెక్‌పోస్ట్ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు (ఫైల్)

కడెం: ఇసుక, కలప అక్రమ రవాణాను అరికట్టేందుకు మండలంలోని పాండ్వపూర్ గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన అటవీశాఖ చెక్‌పోస్ట్ ప్రాణాలు తీస్తోంది. కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ అభివృద్ధి పేరిట ఇక్కడి సిబ్బంది ద్విచక్ర వాహనాలు మినహా అన్ని రకాల వాహనాలను ఆపి ఎంట్రీ ఫీజు వసూలు చేస్తున్నారు. దీంతో చెక్‌పోస్ట్ వద్దే వాహనాలు బారులు తీరుతున్నాయి. రాత్రి 9గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు వాహనాలకు అనుమతి లేకపోవడంతో వాహనాలను రోడ్డుపైనే నిలిపి ఉంచుతున్నారు. రాత్రివేళ ఆగి ఉన్న వాహనాలు కనిపించక ఇతర వాహనాలు ఢీకొంటున్నాయి. ఈ ఘటనల్లో మృత్యువాత పడుతున్నవారు కొందరైతే చాలామంది గాయాలపాలవుతున్నారు. గతంలో దస్తురాబాద్ మూలమలుపు వద్ద ఉన్న చెక్‌పోస్ట్‌ను వంతెన సమీపంలో ఏర్పాటు చేశారు. చెక్‌పోస్ట్ వద్ద లైటింగ్, సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో చెక్‌పోస్ట్ వద్ద ఆగి ఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టి మండలంలోని బెల్లాల్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. తాజాగా బుధవారం రాత్రి ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టి పాండ్వపూర్ గ్రామానికి చెందిన రైతు మల్లేశ్ మృత్యువాత పడ్డాడు. ఈ విషయమై ఖానాపూర్ ఎఫ్‌డీవో కోటేశ్వర్‌రావును వివరణ కోరగా.. ఇటీవలే చెక్‌పోస్ట్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొని ఒకరు మృతి చెందారని, మృతుడి కుమారుడిని అటవీశాఖలో వాచర్‌గా నియమించి ఆదుకుంటామన్నారు. చెక్‌పోస్ట్‌ను గ్రామ సమీపంలోని కడెం ప్రాజెక్ట్ ఎడమ కాలువ పక్కన ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని చెప్పారు.

రుణమేళాను వినియోగించుకోవాలి



మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న శోభ

నిర్మల్‌చైన్‌గేట్: బ్యాంకర్లు నిర్వహిస్తున్న రుణమేళాను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రుణమేళా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దేశాభివృద్ధిలో బ్యాంకుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ శోభ లబ్ధిదారులకు రూ.25కోట్ల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నిర్మల్ ప్రాంతీయ కార్యాలయ నూతన భవనాన్ని రీజినల్ మేనేజర్ మహి వివేక్ ఆధ్వర్యంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ శోభ ప్రారంభించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో జే గోవింద్‌రావు, చీఫ్ మేనేజర్ ఈ విజయ్‌కుమార్, శివకుమార్, రాఘవేందర్‌రావు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అద్దాలు అందేనా?

మొదటివిడత కంటివెలుగు వివరాలు
పరీక్షలు చేయించుకున్న వారిసంఖ్య: 3,75,859
దగ్గరిచూపు అద్దాలు తీసుకున్నవారు: 62,342
దూరపుచూపు అద్దాలు తీసుకున్నవారు: 53,919
ఆపరేషన్‌కు గుర్తించిన వారి సంఖ్య: 29,284
ఆపరేషన్ చేయించుకున్న వారి సంఖ్య: 13,145

రెండోవిడత కంటివెలుగు వివరాలు	
జిల్లా జనాభా	7,94,548
18 ఏళ్లు పైబడిన వారు	5,47,000
ఇప్పటివరకు కంటి పరీక్షల సంఖ్య	50,750
'దూరపు' అద్దాల ఆర్డర్ సంఖ్య	9,382
'1' రకం అద్దాలు తీసుకున్నవారు	2,669
'1.5' రకం '' తీసుకున్నవారు	2,493
'2' రకం '' తీసుకున్నవారు	2,510
'2.5' '' రకం తీసుకున్నవారు	1,258
'3' '' రకం తీసుకున్నవారు	778



లక్ష్మణచాందలో పరీక్ష చేస్తున్న వైద్యుడు (ఫైల్)

- కంటివెలుగులో దూరపుచూపు కళ్లద్దాల పంపిణీలో జాప్యం
- రీడింగ్ అద్దాలు మాత్రమే అందజేత
- డయాబెటిక్ రెటినోపతి లక్షణాలు గుర్తించే యంత్రంలేక నిరాశలో బాధితులు
- శస్త్రచికిత్సలపై స్పష్టత కరువు

నిర్మల్‌చైన్‌గేట్/లక్ష్మణచాంద: జిల్లాలో ఎక్కువమంది కంటి సమస్యలతో బాధ పడుతున్నారు. రెండో విడత కంటివెలుగు కార్యక్రమంలో ఈ విషయం వెల్లడవుతోంది. కంటి పరీక్షల్లో చాలామందికి చూపు మందగించడం, కంటి శుక్లాల సమస్యలు బయటపడుతున్నాయి. ప్రభుత్వ సెలవు దినాలు పోను గడిచిన 14 రోజుల్లో జిల్లాలో 50,750 మందికి పైగా పరీక్షలు నిర్వహించగా దాదాపు సగం మందికి సమస్యలున్నాయి. వైద్యులు సమస్యలను గుర్తించి అప్పటికప్పుడే కళ్లద్దాలు పంపిణీ చేస్తున్నారు. పని ఒత్తిడి, ఉద్యోగ భారం, సెల్‌ఫోన్, కంప్యూటర్ల వినియోగం తదితర కారణాలే నేత్ర సమస్యలకు ప్రధాన కారణమవుతున్నాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. కాగా, మధుమేహ వ్యాధిగ్రస్తులను పరీక్షించి రెటీనా, డయాబెటిక్ రెటినోపతి లక్షణాలను గుర్తించే యంత్రం లేక పోవడంతో చాలామంది నిరాశతో వెనుదిరుగుతున్నారు.

దగ్గరిచూపు లోపం ఉన్నవారికే..

కంటివెలుగు శిబిరాల్లో 18 ఏళ్లు నిండిన వారికి పరీక్షలు చేస్తున్నారు. అవసరమైన వారికి వెంటనే రీడింగ్ అద్దాలు ఇస్తున్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఎదురవుతున్న డయాబెటిక్ రెటినోపతి పరీక్ష చేయడం లేదు. ఏఆర్ యంత్రంలో ఈ సౌలభ్యం లేక పరీక్షలకు వచ్చినవారు నిరాశకు గురవుతున్నారు. దగ్గరిచూపు లోపం ఉన్న వారికే అద్దాలు ఇస్తూ దూరపు చూపు మందగించిన వారికి తర్వాత ఇస్తామంటూ పంపిస్తున్నారు.

సెల్‌ఫోన్ వాడకంతోనే అధికం..

ప్రస్తుతం సెల్‌ఫోన్ వినియోగం ప్రతి ఒక్కరికీ తప్పనిసరైంది. తెల్లవారింది మొదలు రాత్రి పడుకునేవరకూ సెల్‌ఫోన్ వెంటే ఉంటోంది. ముఖ్యంగా యువత ఎప్పుడూ స్మార్ట్‌ఫోన్‌తోనే గడుపుతున్నారు. మరోవైపు కంప్యూటర్లు, ట్యాబ్‌ల వినియోగం పెరిగింది. వైద్యశిబిరాలకు వచ్చేవారిలో చాలా మందికి మొబైల్‌ఫోన్, కంప్యూటర్ల ద్వారానే చూపు మందగిస్తున్నట్లు గుర్తిస్తున్నారు. ముఖ్యంగా ఉరుకులపరుగుల జీవనం, ఉద్యోగ ప్రస్థానంలో ఒత్తిడికి గురవుతుండడంతో రక్తపోటు, మధుమేహ బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఇది రెటీనా డయాబెటిక్ రెటినోపతి సమస్యలకు దారితీస్తోంది.

శస్త్ర చికిత్సలపై సందేహాలెన్నో..

కంటివెలుగులో కళ్లద్దాల పంపిణీకే అధికారులు పరిమితమవుతున్నారు. కేంద్రాల వద్ద దగ్గరి చూపు అద్దాలను వెంటనే అందజేస్తుండగా, ప్రిస్క్రిప్షన్ అద్దాలను వారం తర్వాత అంగన్‌వాడీల ద్వారా నేరుగా ఇంటికే పంపిస్తామని చెబుతున్నారు. అయితే మొదటివిడతలో నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమంలో ఒకరికి సంబంధించిన అద్దాలను మరొకరికి పంపిణీ చేశారని, కొన్నిచోట్ల అద్దాలను పంపిణీ చేయలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. శుక్లాలు, ఇతర కంటి సమస్యలకు ఆపరేషన్లు అవసరమైన వారి సంఖ్య ఎంతన్నదీ అధికారులు తేల్చడం లేదు. కంటి అద్దాలతో పాటు ఆపరేషన్లను సకాలంలో నిర్వహించాలని బాధితులు కోరుతున్నారు.

పక్షంరోజులు గడిచినా..

కంటివెలుగు శిబిరాల్లో పరీక్షించి జిల్లాలో 9,382 మందికి దూరపు చూపు సమస్య ఉందని వైద్యులు గుర్తించారు. వీరందరికీ కళ్లద్దాలు ఇచ్చేందుకు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేశారు. కానీ.. పక్షం రోజులు గడిచినా ఇంకా కళ్లద్దాలు రాలేదు. దీంతో బాధితులు నిరాశ చెందుతున్నారు.

50,750 మందికి పరీక్షలు


కంటివెలుగు పరీక్షలు 100 రోజుల్లో పూర్తి చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలో 32 వైద్య బృందాలను ఏర్పాటు చేశారు. 14రోజుల్లో 50,750 మందికి పరీక్షలు నిర్వహించి 9,714 మందికి అద్దాలు పంపిణీ చేశారు. దూరపుచూపు లోపం ఉన్న 9,382 మందిని గుర్తించి అద్దాల కోసం ఆర్డర్లు ఇచ్చారు. ఆపరేషన్లు అవసరమైనవారికి అధికారులు ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ప్రభుత్వం ఆపరేషన్లు చేయిస్తుందా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

కళ్లద్దాలు త్వరగా ఇవ్వాలి



కంటివెలుగు క్యాంపులో గత నెల 20న కంటి పరీక్షలు చేయించుకున్నాను. వైద్య సిబ్బంది పరీక్షించి దృష్టిలోపం ఉందని చెప్పారు. అందు కోసం ప్రత్యేక కళ్లద్దాలకు ఆర్డర్ చేశామన్నారు. పది రోజుల్లో ఇంటికే వస్తాయని చెప్పారు. ఇంకా రాలేదు. – సంతోష్, నిర్మల్

ఆర్డర్ ఇచ్చాం.. రావాల్సి ఉంది



జిల్లాలో రెండోవిడత కంటివెలుగు కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. శిబిరాలకు ప్రజలు ఎక్కువసంఖ్యలో హాజరై పరీక్షలు చేయించుకుంటున్నారు. అవసరమైనవారికి రీడింగ్ గ్లాసులు ఇస్తున్నాం. దృష్టిలోపం అధికంగా ఉంటే కళ్లద్దాలు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి ప్రిస్క్రిప్షన్ కళ్లద్దాలు రావాల్సి ఉంది. రాగానే పంపిణీ చేస్తాం. – ధనరాజ్, డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

ప్రారంభమైన డిగ్రీ పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ విశ్వ విద్యాలయం పరిధిలోని డిగ్రీ ప్రథమ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు. ఈ పరీక్షలు ఈ నెల 22 వ తేది వరకు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని, ఉమ్మడి జిల్లా పరిధిలో 50 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

టీఏవీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా విష్ణు


ఉయిక విష్ణు

ఎదులాపురం: తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఇంద్రవెల్లి మండలం పిప్రి గ్రామానికి చెందిన ఉయిక విష్ణు ఎన్నికయ్యాడు. ఈ నెల 5, 6 తేదీల్లో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన సంఘం రాష్ట్ర 2వ మహాసభల్లో రాష్ట్ర అధ్యక్షుడు పూసం సచిన్ నేతృత్వంలో ఎన్నికున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

'అధికారుల నిర్లక్ష్యంతోనే గైర్హాజరు'

ఆదిలాబాద్‌టౌన్: విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే 88 మంది ప్రధానోపాధ్యాయులు జూమ్ మీటింగ్‌కు గైర్హాజరయ్యారని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలందర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం, వారి తప్పులను కప్పిపుచ్చుకునేందుకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం సరికాదన్నారు. తమ సంఘం పక్షాన దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వారు పేర్కొన్నారు.

బ్లడ్‌బ్యాంక్ తనిఖీ


బ్లడ్ బ్యాంక్‌ను పరిశీలిస్తున్న శ్రీధర్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రిమ్స్ ఆసుపత్రిలో గల బ్లడ్ బ్యాంక్‌ను సెంట్రల్ డ్రగ్ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్ గురువారం తనిఖీ చేశారు. ఐదేళ్లకోసారి బ్లడ్‌బ్యాంక్ అనుమతులను రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం రిమ్స్ అధికారులు సెంట్రల్ డ్రగ్ డిపార్ట్‌మెంట్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో శ్రీధర్ రిమ్స్‌లోని బ్లడ్‌బ్యాంక్‌ను సందర్శించారు. సిబ్బంది, పరికరాలు, బ్లడ్ యూనిట్ల నిల్వ సామర్థ్యం, యంత్రాలు , దాని పనితీరును పరిశీలించారు. శుక్రవారం సైతం తనిఖీలు చేయనున్నారు. తనిఖీల అనంతరం దీనిపై సెంట్రల్ డ్రగ్ డిపార్టుమెంట్ ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నారు. ఆయన వెంట రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డ్రగ్ ఇన్స్‌పెక్టర్ శ్రీలత ఉన్నారు.

కంది పంట దగ్ధం


దగ్ధమైన కంది పంట

ముథోల్: మండలంలోని ఎడ్‌బిడ్‌లో నల్ల విఠల్‌రెడ్డికి చెందిన కంది కుప్ప బుధవారం రాత్రి దగ్ధమైంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం ఈ ఏడాది రెండెకరాలు కౌలుకు తీసుకుని అందులో కంది పంట వేశాడు. పంట కోతకు రావడంతో కోసి పంటచేనులోనే కుప్పగా వేశాడు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కుప్పకు నిప్పంటించారు. సుమారు పది క్వింటాళ్ల వరకు పంట దగ్ధమైందని, సుమారు రూ.90వేల వరకు ఆస్తినష్టం జరిగిందని బాధిత రైతు వాపోతున్నాడు.

నత్తనడకన ఈ–శ్రమ్


ఆదిలాబాద్‌లోని కార్మిక శాఖ భవనంలో దరఖాస్తు చేసుకుంటున్న కార్మికులు (ఫైల్)

- అవగాహన లేక దరఖాస్తు చేసుకోని వైనం
- 16 నుంచి 59 ఏళ్ల కార్మికులు అర్హులు
- జిల్లాలో 4 లక్షలకు పైగా కార్మికులు
- దరఖాస్తు చేసుకున్నవారు 1,27,193 మంది మాత్రమే

ఆదిలాబాద్‌రూరల్: కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలను అమలు చేస్తున్నాయి. అందులో భాగంగానే పథకాన్ని ప్రవేశపెట్టాయి. ఈ పథకానికి అసంఘటిత, సంఘటిత కార్మికులు అర్హులు. ఎలాంటి ఫీజు లేకుండా ఆన్‌లైన్‌లో ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఏదైనా సంఘటన జరిగి కార్మికుడు మృతి చెందితే ప్రభుత్వం రూ.2 లక్షల బీమా ఆ కుటుంబానికి అందజేయనుంది.

జిల్లాలో 4లక్షలకు పైగా కార్మికులు

ఈ–శ్రమ్ పథకాన్ని ప్రభుత్వం గతేడాది అక్టోబర్ మాసంలో ప్రారంభించింది. ఈ పథకానికి దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. 16 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఈ పథకానికి అర్హులు. జిల్లాలో సుమారు 4 లక్షల వరకు సంఘటిత, అసంఘటితరంగ కార్మికులు ఉన్నారు. జిల్లాలో 2 లక్షల మందికి పథకం వర్తింపజేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. కానీ ఈ నెల 9వ తేదీ వరకు 1,27,193 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు.

కొరవడిన అవగాహన

ఈ పథకంపై కార్మికులకు అవగాహన లేకపోవడంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ఆధార్ కార్డు మాదిరిగానే 12 అంకెలు గల ఈ–శ్రమ్ కార్డు జారీ అవుతుంది. అధికారులు ఈ పథకంపై అవగాహన కల్పించకపోవడం, వారు చొరవ చూపకపోవడమే కారణంగా తెలుస్తోంది. వారు దృష్టి సారిస్తే ప్రయోజనం చేకూరుతుందని పలువురు కార్మికులు పేర్కొంటున్నారు.

ఐటీ, పీఎఫ్ చెల్లించని వారు అర్హులు

పథకానికి ఐటీ, పీఎఫ్ చెల్లించని కార్మికులు అర్హులు. ఒక్కసారి ఆన్‌లైన్‌లో ఈ పథకానికి దరఖాస్తు చేసుకుంటే జీవిత కాలం పాటు వర్తిస్తుంది. కానీ అవగాహన లేకపోవడంతో కార్మికులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ముందుకు రావడం లేదు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి ఆన్‌లైన్ చేయిస్తే బాగుంటుందని పలువురు కార్మికులు కోరుతున్నారు.

అవగాహన లేకనే..



కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ–శ్రమ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. కార్మిక సంఘం ఆధ్వర్యంలో అవగాహన కల్పించడంతో పాటు ప్రత్యేకంగా శిబిరాలు ఏర్పాటు చేసి కొంతమంది కార్మికులను నమోదు చేయించాం. చాలా మందికి అవగాహన లేక దరఖాస్తు చేసుకోవడం లేదు.

– గాజంగుల రాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశాం

ఈ–శ్రమ్ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు కార్మిక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మండల కేంద్రాల్లో శిబిరాలను సైతం నిర్వహిస్తున్నాం. జిల్లా కార్మిక శాఖ కార్యాలయంలో సైతం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశాం. ఆసక్తి గల కార్మికులు తమ కార్యాలయంలో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

– శ్రావణి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్, ఆదిలాబాద్

గురుకృప దివస్‌గా గుర్తించాలి


వినతిపత్రం అందజేస్తున్న రాథోడ్ జనార్దన్

నార్నూర్: నార్నూర్ మండలంలోని కొత్తపెల్లి దీక్ష గురువు సంత్ సేవాలాల్ దీక్ష భూమిని రాష్ట్ర పండుగగా గుర్తించడంతో పాటు ఏటా జనవరి 11న గురు కృప దివస్‌గా గుర్తించాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ గురువారం అసెంబ్లీ ఆవరణలో గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి రాష్ట్ర గురుకృప దివస్‌గా గుర్తించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వివరించారు. మంత్రిని కలిసిన వారిలో నార్నూర్ ఎంపీపీ కనక ప్రభాకర్, మోతుబాయి, వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేశ్, తదితరులు ఉన్నారు.

అద్దె బస్సులపై 10శాతం రాయితీ

- జూన్ 30 వరకు వర్తింపు
- ఆర్టీసీ ఆర్ఎం జానీరెడ్డి

ఆదిలాబాద్: అద్దె బస్సులపై 10శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కే.జానీరెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని రకాల సర్వీసులపై ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపారు. గతంలో కార్తీక మాసం, వనభోజనాలు, శబరిమల అయ్యప్ప దర్శనం సందర్భంగా ఈ రాయితీ కల్పించగా గత ఏడాది డిసెంబర్ 31తో గడువు ముగిసిందని పేర్కొన్నారు. ప్రస్తుతం శుభకార్యాల సీజన్ నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో ఈ ఏడాది జూన్ 30వరకు రాయితీని పునరుద్ధరించినట్లు తెలిపారు. ప్రైవేట్ వాహనాలతో పోలిస్తే తక్కువ ధరకే ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇస్తోందని, ఎలాంటి నగదు డిపాజిట్ లేకుండానే ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ముందస్తు బుకింగ్ కోసం www.tsrtconline.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని, వివరాలకు స్థానిక డిపో మేనేజర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

లింబారావు కుటుంబాన్ని ఆదుకోవాలి

- తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు గేడం గణేశ్


మాట్లాడుతున్న గేడం గణేశ్

నార్నూర్(ఆసిఫాబాద్): అటవీశాఖ అధికారి దాడిలో గాయపడిన నార్నూర్ మండలం నాగల్‌కొండ గ్రామానికి చెందిన కోవా లింబారావ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గేడం గణేశ్ డిమాండ్ చేశారు. గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజుల క్రితం లింబరావుపై అటవీ శాఖ అధికారులు కర్రలతో దాడి చేయడంతో గాయాలపాలయ్యాడన్నారు. బాధిత కుటుంబానికి పది రోజుల్లో ఫారెస్ట్ పట్టా కింద 20 ఎకరాల భూమి ఇవ్వాలని, బీట్ ఆఫీసర్ కళ్యాణిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. ఆయన వెంట ఆదివాసీ మహిళ జిల్లా అధ్యక్షురాలు పెందూర్ పుష్పరాణి, జిల్లా ఉపాధ్యక్షుడు మెస్రం మాణిక్ రావ్, ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదివాసీ సలహాదారుడు సెడ్మకి సీతారాం, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు, విద్యార్థి సంఘాల జేఏసీ కన్వీనర్ బి.రాహుల్, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆత్రం గణపతి, శ్రీరామ్, కుమ్రం నగేష్, గ్రామ పటేల్ కోవా మారు, కుమ్రం మనకు, తదితరులు ఉన్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయింపు


ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించిన యువతి

తాండూర్(బెల్లంపల్లి): తనను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసగించిన ప్రియుడి ఇంటి ఎదుట ఓ యువతి బైఠాయించిన ఘటన గురువారం మండలంలోని అచ్చులాపూర్‌లో చోటు చేసుకుంది. అచ్చులాపూర్ గ్రామానికి చెందిన అడ్వాల కృష్ణ , తేంద్ర స్వప్న కాలేజీలో చదువుకున్నప్పటి నుంచి స్నేహితులు. వారి స్నేహం కాస్తా ప్రేమగా మారింది. తనను పెళ్లి చేసుకుంటానని చెప్పి స్వప్నను నమ్మించిన కృష్ణ తన అవసరాలు తీర్చుకున్నాడు. పెళ్లికి ఇరువురి పెద్దలు అంగీకరించలేదు. సదరు యువతికి వేరే వ్యక్తితో వివాహం జరిపించారు. ఆ తర్వాత కూడా కృష్ణ తరచూ ఫోన్ చేసి భర్తతో కాపురం చేయవద్దని, తాను పెళ్లి చేసుకుంటానంటే మరొకరిని ఎలా పెళ్లి చేసుకున్నావని మానసికంగా వేధించడం ప్రారంభించాడు. తనవద్ద ఉన్న ఫొటోలు, వీడియోలు బయటపెడ్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. భర్తకు విడాకులిస్తే పెళ్లి చేసుకుంటానని నమ్మ బలకడంతో విడాకులు ఇచ్చింది. ఆతర్వాత కృష్ణ మరో అమ్మాయిని వివాహం చేసుకోవడంతో మూడు రోజుల క్రితం తాండూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇప్పటి వరకూ పోలీసులు అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించింది. ఆమెకు పలువురు మహిళలు సంఘీభావం ప్రకటించారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

తానూరు(ముధోల్): ఈ నెల 3న మద్యం మత్తులో పురుగుల మందు తాగిన మండలంలోని మొగ్లి గ్రామానికి చెందిన సిద్దలోడ్ రామ (20)నిజామాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. గ్రామానికి చెందిన సిద్దలోడ్ శంకర్, కమలాబాయి దంపతుల కుమారుడు సిద్దలోడ్ రామ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 3న మద్యం సేవించి పంటపొలానికి వెళ్లాడు. మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు నిజామాబాద్‌కు తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

జైనథ్(ఆదిలాబాద్): ఈ నెల 5న మద్యం మత్తులో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఆకుల అశోక్ (45) బుధవారం రాత్రి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం అశోక్ కొంత కాలంగా తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి అతిగా మద్యం సేవించాడు. మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి

ఇచ్చోడ(బోథ్): అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి చెందినట్లు ఇన్‌చార్జి ఎస్సై నీరేశ్ తెలిపారు. బజార్‌హత్నూర్ మండలంలోని చందునాయక్ తాండకు చెందిన కాత్లె చంద్రభాన్ (50) మద్యానికి బానిసై ఆర్నెళ్లుగా ఇంటికి వెళ్లకుండా మండల కేంద్రంలోనే తిరుగుతున్నాడు. రెండు రోజుల క్రితం అతిగా మద్యం సేవించి పోస్టాఫీసు ముందున్న ఓ భవనంపైకి ఎక్కి పడుకున్నాడు. గురువారం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై తెలిపారు.

వివాహిత అదృశ్యం

సారంగపూర్(నిర్మల్): మండంలోని జామ్ గ్రామానికి చెందిన జంగం యమున అనే వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మండలంలోని జామ్ గ్రామానికి చెందిన యమునకు ఎనిమిదేళ్ల క్రితం కామారెడ్డిలోని బ్రాహ్మణపల్లికి చెందిన జంగం అనిల్‌తో వివాహమైంది. భర్త అనిల్‌తో గొడవపడి నాలుగు నెలల క్రితం పుట్టింటికి వచ్చేసింది. ఇటీవల తన తండ్రి చేయి విరగడంతో ఆయుర్వేద చికిత్స నిమిత్తం గురువారం మామడ మండల కేంద్రంలో వైద్యం చేయించుకునేందుకు వెళ్లాడు. చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన అల్లమయ్యకు తన కుమార్తె కనిపించకపోవడంతో సమీప బంధువుల ఇళ్లలో వెతికాడు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఆదిలాబాద్‌రూరల్: మావల మండల కేంద్రంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు విలాస్‌కు గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం..ఆదిలాబాద్ పట్టణంలోని ఓల్డ్ హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు ద్విచక్ర వాహనంపై మావల వైపు వెళ్తుండగా పాత జాతీయ రహదారిపై కారు ఢీకొట్టింది. దీంతో ఆయన తలకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించడంతో ప్రథమ చికిత్స అందించి రిమ్స్‌కు తరలించారు.

బాలికల భవితకు భరోసా..

- రూ.250తో సుకన్య ఖాతా ప్రారంభించేలా కేంద్రం నిర్ణయం
- జిల్లాలో తపాలా శాఖ ఉద్యోగుల ప్రత్యేక డ్రైవ్
- పోస్టల్ కార్యాలయాల్లో కౌంటర్ల ఏర్పాటు


వడూర్‌లో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న తపాలాశాఖ ఉద్యోగులు (ఫైల్)

నేరడిగొండ(బోథ్): కేంద్ర ప్రభుత్వం బాలికల భవితకు అండగా నిలిచేందుకు సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం తపాలా శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతుంది. పదేళ్లలోపు వయస్సు ఉన్న పిల్లలందర్నీ ఇందులో చేర్పేందుకు ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. కార్యక్రమం ప్రారంభమై ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఫిబ్రవరి 11, 12, 13 తేదీల్లో ఢిల్లీలో 'అమృత్ పెక్స్'ను చేపట్టనుంది. ఈ నేపథ్యంలో అధికారులు ఖాతాలు పెంచడానికి కృషి చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక డ్రైవ్..

కేంద్ర ప్రభుత్వం 2015 జనవరిలో సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని ప్రారంభించింది. అప్పటి నుంచి దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. పథకం వల్ల కలిగే లాభాలను అధికారులు, సిబ్బంది బాలికల తల్లిదండ్రులకు వివరిస్తూ ఆసక్తి ఉన్న వారితో ఖాతాలు తెరిపిస్తున్నారు. 'అమృత్ పెక్స్' సందర్భంగా తపాలా శాఖ జిల్లాలో ఖాతాలు తెరిచే లక్ష్యాన్ని నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, మంచిర్యాలలోని ప్రధాన తపాలా కార్యాలయాలు, 63 సబ్ పోస్టాఫీసులు, 483 బ్రాంచి పోస్టాఫీసులు ఉండగా ప్రతీ కార్యాలయంలో ఖాతాలు తెరిచేలా లక్ష్యం నిర్దేశించారు. మొత్తం 3,300 ఖాతాలను ఈనెల 10లోగా తెరవాలని గడువు విధించారు.

రూ.250 తోనే ప్రారంభం..

పథకం ప్రారంభంలో రూ.వెయ్యితో ఖాతా తీసేలా రుసుం నిర్ణయించారు. అనంతరం పేద, మధ్య తరగతి కుటుంబాల వారికి ఉపయోగపడేలా ఆలోచించిన ప్రభుత్వం రూ.250కు తగ్గించింది. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి పదేళ్ల లోపు వారికి ఇది వర్తిస్తుంది.

ప్రత్యేక కౌంటర్లు..

లక్ష్యం చేరుకోవడానికి తపాలా శాఖ అధికారులు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ప్రజల సౌకర్యార్థం ప్రతి కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఖాతాలు తీసేలా చర్యలు తీసుకుంటున్నారు.

లక్ష్యం చేరుకుంటాం



తపాలా శాఖ చేపట్టనున్న అమృత్ పెక్స్‌లో భాగంగా ఉమ్మడి జిల్లాకు నిర్ణయించిన సుకన్య ఖాతాల లక్ష్యాన్ని చేరుకుంటాం. అందుకు తగ్గ ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆడపిల్లల తల్లిదండ్రులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– కేబీఆర్ ప్రసాద్, పోస్టల్ సూపరింటెండెంట్


పేకాట రాయుళ్ల అరెస్టు

బోథ్: మండల కేంద్రం శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గురువారం స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3,100 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రిక్షా కాలనీ అడనేశ్వర ఆలయ సమీపంలోని ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కాలనీకి చెందిన లక్ష్మి ఇంట్లో లేని సమయంలో గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఈప్రమాదం జరిగింది. ఇంట్లోని ఆహార పదార్థాలు, వస్త్రాలు, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదంలో దాదాపు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితురాలు వాపోయింది. సంఘటన స్థలానికి అగ్నిమాపక శాఖ అధికారులు చేరుకొని మంటలను ఆర్పివేశారు.

చుక్కలదుప్పి మృతి


దుప్పిని తరలిస్తున్న దృశ్యం

ఖానాపూర్: కుక్కల దాడిలో గాయపడి పట్టణంలోని సాయిబాబా ఆలయం ఆవరణ లో రోడ్డుపైకి వచ్చిన చుక్క ల దుప్పి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎఫ్ఎస్‌వో సుధాకర్ తెలిపారు. బుధవారం సాయంత్రం జనావా సాల్లోకి వచ్చిన దుప్పిని స్థానికులు పట్టుకుని ఎఫ్ఎస్‌వోకు అప్పగించారు. చికిత్స అందించి ఎక్బాల్‌పూర్ అటవీ ప్రాంతంలోని బేస్‌క్యాంపుకు తరలించారు. చికిత్స అందిస్తుండగానే రాత్రి మృతి చెందింది.

వరికి తెగుళ్ల బెడద


పీక పురుగు ఆశించిన వరి పంట


- పంటను ఆశిస్తున్న పీక, లద్దెపురుగులు
- ఆందోళనలో అన్నదాత

చెన్నూర్‌రూరల్: ఈ ఏడాది యాసంగి సీజన్‌లో వరి నాట్లు ఇంకా కొనసాగుతున్నాయి. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా సుమారు 98,521 ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేస్తున్నట్లు అధికారులు అంచనా వేశారు. చెన్నూర్ మండలంలో 13 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తున్నారు. డిసెంబర్ చివరి వారం నుంచి జనవరి మాసంలో నాటువేసిన పంటలను పీక పురుగు, లద్దె పురుగు ఆశించింది. దీంతో రైతులు మందులు పిచికారీ చేస్తున్నారు.

తెగుళ్లు.. లక్షణాలు

లద్దె పురుగు సోకితే వరి ఆకుల చివరలను కొరికి ఆకుల అంచుల వెంబడి కత్తిరిస్తూ మొక్కల మొదళ్లను కూడా తింటుంది. పొలంలో నీరు ఎక్కువగా ఉన్నప్పుడు వీటి ఉధృతి తక్కువగా ఉంటుంది. వరి మొక్కలు ఎర్రబడటం, ఆకులపై తుప్పు వర్షపు మచ్చలు కలిగి క్రమేపి మొక్కలు చనిపోతాయి. పిలకలు వేసే దశలో వరి ఆకులపై నూలు కండె ఆకారంలో మచ్చలు ఏర్పడి క్రమేణా అనుకూల పరిస్థితులలో ఇవి పెద్దగా మారుతాయి. మచ్చల చివర్లో మొనతేలి ఉంటుంది. దీంతో ఆకులు పాక్షికంగా లేదా మొత్తం ఎండిపోతాయి. దూరం నుంచి చూస్తే పంట తగులబడినట్లు కనిపిస్తుంది.

నివారణ చర్యలు చేపట్టాలి



లద్దె పురుగు నివారణ కోసం ఫ్లూబెండియామైడ్ 0.1ఎంఎల్ లేదా క్లోరంట్రానిలిప్రోల్ 0.3ఎంఎల్ లీటరు నీటికి కలిపి సాయంత్ర పిచికారీ చేయాలి. పొలంలో పూర్తిగా నీళ్లు పెట్టి పురుగు మందు పిచికారి చేస్తే మంచిది. దీని నివారణకు పొలంలో నీరు నిల్వ ఉంచుతూ తీసివేస్తూ కొత్త నీరు పెట్టడం చేయాలి. తద్వారా లవణాల సాంద్రత పెరగకుండా నిరోధించవచ్చు. సూక్ష్మ పోషకాలైన ఫార్ములా–4, చిలామెన్‌వంటి మందులు పిచికారీ చేయాలి.

– కవిత, ఏవో, చెన్నూర్

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టేక్‌ఓవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా రుణానికి వర్తిస్తాయి. సంప్రదించండి: 9463846068. [T-1745]

WANTED

■ ప్రై.కం. కి కంప్యూటర్ ఆపరేటర్ & టెలికాలర్స్ కావలెను. Qly. ఇంటర్ & డిగ్రీ, Age: 20-26, జీ.6000+ఇన్సెం+ కమీషన్ @ ఆదిలాబాద్. ఫోన్ : 9381932213, 7075080883. [H-793603]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ J Group కంపెనీ హైదరాబాద్‌లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువకులు కావలెను. Age: 18 to 30, సాలరీ: 14,000/- to 40,000/-+ కమీషన్. Qualification: 10th, Inter, Degree. ఫోన్: 9666688883. [HA-741]

■ వరంగల్‌లోని చికెన్ సెంటర్‌లో పనిచేయుటకు అనుభవం గల వర్కర్స్ కావలెను. జీతం: 18000+రూం + భోజనం ఫ్రీ. సెల్: 6281342090, 9949857816. [WA-6477]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,